# డప్పు

యండమూరి వీరేంద్రనాథ్




డప్పేశ్వర్రావు మా సెక్షన్లో పనిచేస్తున్నాడనీ, నా కిందేనని తెలియటంతో పొంగిపోయాను. డప్పు వాయించేవాళ్ళంటే నేను చెవి తెగ్గోసుకుంటాను. అసలు డప్పు వాయించటం అనేది అన్నిటికన్నా ఉత్తమోత్తమమయిన కళ అని నా వుద్దేశ్యం. అరిచేత్తోనూ వేళ్ళతోనూ శృతిబద్ధంగా వాయిస్తూవుంటే వినటానికి యెంత సొంపుగా వుంటుందో. అంత గొప్ప కళాకారుడు నా సెక్షన్‌లో వున్నందుకు యెంతో గర్వించి, వెంటనే నాల్గు ఇంక్రిమెంట్లు జారీ చెయ్యవలసిందిగా నా పై అధికారులకి విన్నవించుకొన్నాను.

నా సిఫార్సుని అంగీకరించి పైవాళ్ళు సదరు ఇంక్రిమెంట్లు జారీచేసేరు.

కళకి తగిన గుర్తింపు లభించినందుకు నేను మహదానందం చెంది, డప్పేశ్వర్రావుని నా గదిలోకి పిల్చి అతనికి వచ్చిన ఇంక్రిమెంట్ల సంగతి చెప్పేను.

అతడు కూడా అమితానందం చెందినవాడై నా గదిలోనే కొద్దిసేపు నా బల్లమీద డప్పు వాయించి వెళ్ళిపోయేడు.

మొత్తం మా సెక్షన్‌లో పనిచేసేది ఆరు

గురు. అందులో ఆరుగురి పెట్టుపని చేసేది రమణరావు వొక్కడే. ముగ్గురు కొంచెం అటూ యిటూగా పర్లేదు. జోగేశ్వర్రావు మాత్రం ఉహూ అసలు పెన్ తియ్యడు. ఇక మిగిలింది డప్పేశ్వర్రావు. అంతటి కళాజీవిని పనిచెయ్యమని అడగడమే? కళ్ళుపోతాయి.

డప్పేశ్వర్రావు బైటకెళ్ళిన అరగంటకి మిగతా ముగ్గురూ లోపలికి వచ్చేరు. అతడిచ్చిన టీపార్టీ ఆరగించి వచ్చినట్టున్నారు. కిళ్ళీలు బిగించేరు. ముగ్గుర్నీ సాదరంగా కూర్చో బెట్టేను.

"మీకు డప్పు అంటే చాలా ఇష్టంలా వుందే" అన్నాడు వాళ్ళలో ఒకరు.

"చాలా యిష్టం. అసలు డప్పుని భారత దేశపు ప్రధాన వాద్యంగా పెట్టాలి" అన్నాను కొంచెం ఆవేశంతో.

అది తమకి రాకపోవడం తమ దురదృష్టం అన్నారు వాళ్ళు.

వాళ్ళవైపు జాలిగా చూసేను.

"సార్" అన్నాడు వాళ్ళలో ఒకడు. "మీరు డప్పు వాయించేవాళ్ళని ఇంత ప్రోత్స హించడం మా అదృష్టం. కళలకి స్థానం లేకుండా పోతున్న పవిత్ర భారత దేశంలో మీలాటివాళ్ళున్నారంటే అది మేం చేసుకున్న పుణ్యం."

....వాళ్ళిలా డప్పు వాయించడం మొదలు పెట్టేసరికి పొంగిపోయాను.

"నాయిన్లారా-మీకేం కావాలి?" అని అడి గేను ఆప్యాయంగా.

"మేము డప్పు నేర్చుకోవాలనుకుంటున్నాం. నేర్చుకుని మీకు పేరు తెస్తాం. ప్రతిరోజూ మూడు గంటలకి వెళ్ళిపోయి డప్పు వాయిం చడం ప్రాక్టీసు చేసుకోవటానికి పర్మిషన్ ఇవ్వండి సార్" అన్నారు ముక్తకంఠంతో.

సరేనని పర్మిషన్ ఇచ్చేసేను.

వాళ్ళ మొహాలు డప్పంత అయినయ్.

ఆ మరుచటి రోజునుంచీ పని మానేసి డప్పు వాయించటం మొదలుపెట్టేరందరూ. వినటానికి ఎంతో బావుండేది. వేళ్ళతో వాయిం చేది-సుతారంగా వాయించేది. వాడికన్నా బాగా వీడు వాయించేది-వీడికన్నా బాగా వాడు వాయించేది. నా చుట్టూచేరి అప్పుడప్పుడూ ముగ్గురూ కలిసి వాయించేవారు. ఒకోసారి ఒక్కొక్కడు వచ్చి సెపరేట్‌గా వాయించే వారు.

మూడు గంటలకి సీట్లు కట్టేసి ప్రాక్టీసుకు వెళ్ళిపోయేవాళ్ళు. వారానికొకసారి కచేరీల కోసం మూడు రోజులు డ్యూటీ లీవ్ పెట్టి వెళ్ళేవాళ్ళు.

డప్పు వాద్యగాళ్ళని నా ఆర్గనైజేషన్ నష్టాన్ని లెఖ్ఖచేయకుండా ప్రోత్సహిస్తు న్నందుకు నాకు మంచి పేరొచ్చింది.

రోజులు అన్నీ ఒకేలా గడవవు కదా. ఆ రోజు జోగేశ్వర్రావు రెండు నెలల శలవు పూర్తి చేసుకొని వచ్చి జాయినయ్యేడు. అర గంట తర్వాత నా దగ్గర కొచ్చేడు. నా టేబుల్ మీద ఒక సర్టిఫికెట్టు పడేసేడు.

"ఏమిటిది?" అని అడిగేను.

"కెప్టెన్‌ని" అన్నాడు.

"దేనికి?"

"బూరదగుంట గోటీబిళ్ళ అసోసియేషన్‌కి నేనే కెప్టెన్‌ని" అన్నాడు స్టయిల్‌గా.

"అయితే ఏమిటట?" అన్నాను.

"ప్రమోషనూ - ప్రతిరోజూ వన్ అవర్ పర్మిషనూ" అన్నాడు.

నాకర్థం కాలేదు. "ప్రమోషన్ ఏమిటి?" అన్నాను.

"డప్పేశ్వర్రావుకి ఇంక్రిమెంట్లెందుకిచ్చారో నాకు ప్రమోషన్ దానికే" అన్నాడు.

అతడి అజ్ఞానానికి నవ్వేను. "చూడు జోగేశ్వర్ - డప్పేశ్వర్రావు అంటే అఖిల భారతదేశమూ గర్వించదగ్గ డప్పు వాద్యగాడు. నువ్వేమో బూరదగుంట అసోసియేషన్ గోటీ బిళ్ళ కాప్టెన్‌వి. నీకూ అతడికీ పోలికెక్కడ?"

దానికి అతను "డప్పంటే దేశానికి సంబం ధించిన వాద్యం. అందుకే అతడు దేశ ఖ్యాతి పొందేడు. మరి గోటీబిళ్ళ, రాష్ట్రం దాటి వెళ్ళలేదుగా! బస్తీమే సవాల్. మా బూరద గుంట గోటీబిళ్ళ అసోసియేషన్‌తో ఎవరైనా

సరే రండి పోటీకి——" అన్నాడు. ఆవేశం వస్తే అతడు మనిషి కాడని తెలిసి అనునయించేను.

"నీ గోటీబిళ్ళవల్ల దేశానికి లాభం ఏమిటోయ్?" అని.

"డప్పువల్ల మాత్రం ఏముందండీ?" అని ఎదురు ప్రశ్న వేసేడు.

'ఓరి వెధవాయ్. నాకే ఎదురు సమాధానం చెస్తావ్. నీ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు రానీ నీ పని చెప్తాను' అని మనసులో అనుకొని పైకి మాత్రం "చూడవోయ్ జోగేశ్వర్రావ్ - మంచి డప్పు వాద్యగాడు వాయిస్తూ వుంటే-వేల వేల మంది గంటల తరబడి అలా.... అలా.... మైమరచి వింటూ వుండిపోతారు తెలుసా?" అన్నాను.

"అది మరీ నేషనల్ వేస్టుకదా" అన్నాడు.

నా కోపం వచ్చింది. "నువ్వేన్నయినా చెప్పు. కేవలం గోటీబిళ్ళ కెప్టెన్‌వయినందుకు నీకు ప్రమోషన్ యివ్వలేను" అన్నాను.

"అయితే స్ట్రయిక్ మొదలెడ్తున్నా" నన్నాడు.

ఉలిక్కి పడ్డాను. అరక్షణంలో మొహం మీద నవ్వు పులిమేసుకొని "ఇంతదానికి స్ట్రయిక్ ఎందుకోయ్——నీ సంగతి నాకు వదిలిపెట్టు" అన్నాను. జోగేశ్వర్రావుకి యూనియన్‌లో పలుకుబడి వుంది. దాని అర్థం గ్రహించి అతడు సంతృప్తిగా వెళ్ళిపోయేడు.

నెల రోజుల్లో అతడికి ప్రమోషను వొచ్చింది. ఇద్దరికి ప్రమోషన్ ఇవ్వాలంటే సీనియారిటీ ప్రకారం ఇంకో ఇద్దరికి ఇవ్వాలి కాబట్టి రంగారావుకీ అప్పారావుకీ ప్రమోషన్లివ్వాల్సి వచ్చింది. ప్రతి ఐదు ప్రమోషన్లకి ఒక షెడ్యూల్ కాస్టు వ్యక్తికి ప్రమోషన్ ఇవ్వాలి కాబట్టి ఎల్లమందికి ఇవ్వాల్సి వచ్చింది.

ఆ తర్వాత మిగిలిన ఒక్కడూ (రమణారావు) వచ్చేడు. "సార్! నా పనిలో ఎక్కడయినా లోపం కనబడుతుందా?" అని అడిగేడు. నిజానికి మా సెక్షన్‌లో సరిగ్గా పని చేసేది అతడొక్కడే.

"లేదోయ్-సూపర్బ్" అన్నాను.

"మరి నాకు ప్రమోషన్!" అని అర్థించేడు.

"చూడు రమణ్రావ్! మన కోటా ఈ సంవత్సరం ఐదే కదా. ఒకటి డప్పు వాయించే వాడికి, ఇంకొకటి గోటీబిళ్ళ ఆడేవాడికి ఇచ్చేం గదా" అన్నాను. "మిగతా ఇద్దరూ సీనియర్స్- ఒక రిజర్వేషను కాండేటూ."

"మీరలా అంటారనే నేను రిజైన్ చేస్తున్నాను సార్" అని చేతిలో లెటర్ బల్లమీద పెట్టేడు.

ఉలిక్కిపడి "అదేమిటోయ్" అన్నాను.

"మా నాన్న పల్లెటూళ్ళో పుణుకులు అమ్ముకునేవాడు సార్! పైసా పైసా కూడబెట్టి అర్ధాకలితో కడుపు మాడ్చుకొని నన్ను చదివించేవాడు. మిట్టమధ్యాహ్నం రోహిణీకార్తి ఎండలో తల్లోంచి చమట కారుతుంటే, ఎండ శరీరాన్ని మాడ్చేస్తుంటే రావిచెట్టుకింద కూర్చొని సల సల కాగే నూనె ముందు నలభై సంవత్సరాల్నించీ కూర్చునే వున్నాడు. రావి చెట్టు ముసలిదైంది. నన్ను చదివిస్తూ చదివిస్తూ మా నాన్న పండుటాకు అయ్యేడు. చదవటం తప్ప ఇంకేమీ నేను నేర్చుకోలేదు సార్! నాకు గోటీబిళ్ళ ఆడటం రాదు. డప్పు వాయించటం రాదు. షెడ్యూల్డు కాస్టువాడినని సర్టిఫికెట్టు సంపాదించటం చేతకాదు. పని చెయ్యటం తప్ప నాకింకేమీ రాదుసార్. దానికి విలువలేని ఈ వ్యవస్థలో ఇలా ఫైళ్ళమధ్య బ్రతకటంకన్న మా పల్లెలో రావిచెట్టుక్రింద నా తండ్రి పక్కనే కూర్చొని పని చేసుకోవడం సంతృప్తిగా వుంటుందని అనుకొంటున్నాను సార్ నేను" అని అతను వెళ్ళిపోయాడు.

బైట మావాళ్ళు వాయిస్తున్న డప్పు వినబడ్తూనే వుంది.

కాని రమణారావు మాటలు గుండెలమీద మోగుతున్నట్టున్నాయి. □